కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర – చీడికాడ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం జరిగింది. కార్యక్ర మంలో భాగంగా బుధవారం 20 మంది విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయంలో వివిధ రకములైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఆటలలో గెలుపొందిన వారికి ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

విశాలాంధ్ర – గొలుగొండ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన గొలుగొండ విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి మనిషి రెండేసి మొక్కలు చొప్పున నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. అప్పుడే పర్యావరణం చక్కగా ఉండి సమృద్ధిగా వర్షాలు కురిసేం దుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక ఎంపీడీవో పట్నాయక్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోను, కే.కోటపాడు అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలోనూ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మానవాళికి ముప్పు వాటిల్లకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని జాగ్రత్తగా పెంచాల్సిన బాధ్యత కూడా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డివిడి ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవ

సందర్భంగా మండలంలోని వెంకటనగరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు దొర, హరికృష్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సమాజంలో అధికంగా మొక్కలు నాటి పోషించాలని యలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఫేపకాయల విజయ అన్నారు. బుధవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని యలమంచిలి కోర్టు ఆవరణలో గల రాజీవ్ క్రీడా మైదానంలో జడ్జి విజయ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో పాటు మొక్కలను కూడా ప్రతి ఒక్కరు నాటితే వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గించి అందరికీ మంచి ప్రాణ వాయువు అందిస్తాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు సంవత్సరంలో కనీసం ఒక్క మొక్క అయినా నాటి పోషించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దూళి నూకరాజు, ఉపాధ్యక్షులు పీవీ రమణ, ఏజీపీ వెంకట్రావు, కోశాధికారి శ్రీనివాస

పట్నాయక్, డి.నాగేశ్వరరావు, సోషల్ ఫారెస్ట్ అధికారులు కనక లింగేశ్వరరావు, పైడిరాజు, సామాజిక కార్యకర్త గేదెల రమణ తదితరులు పాల్గొన్నారు.

మై హోం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో

మండలంలోని ములకలాపల్లి గ్రామం వద్ద గల మై హోం ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్ (సిమ్మెంట్ ఫ్యాక్టరీ)లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఫ్యాక్టరీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించినట్లు ఫ్యాక్టరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్

(వర్క్స్) వి.హెచ్.చౌదరి అన్నారు. ఈ సందర్భంగా వి.హెచ్. చౌదరి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపైన ఉందని తెలిపారు.

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్ర నాథ్ ఠాగూర్ క్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకట రమణ ఆధ్వర్యంలో గ్రంథా లయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని

నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రకృతికి మానవుడికి గల సంబంధం, చెట్లు పెంచడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మోటారు వాహనాల వినియోగం తగ్గించడం, మంచి ఆరోగ్య వంతమైన వాతావరణం అందించాలని, మనిషికి జీవన ప్రమాణాలు పెంచాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయం అధికారి జనార్దనరావు గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది వి.దేవి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంతో అనేక నష్టాలు

విశాలాంధ్ర – యలమంచిలి/రాంబిల్లి: మండలంలోని పెద్దకల వలపల్లి గ్రామంలో ఎన్ఏఓబీ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న నిరసన 225 రోజులకు చేరుకుంది. డీఆర్డీఓ వారు తమ గ్రామ రెవెన్యూలో సుమారు 7 కిలోమీటర్లు ప్రహరీ నిర్మాణం చేయుట వలన వారికి జరుగుతున్న నష్టాలను పేపర్లపై వ్రాసుకొని చూపుతూ అధికార్లపై నిరసన తెలియజేస్తున్నారు. గ్రామంలో మా పూర్వీకులు నుండి కోట కొండలపై గొర్రెలు, మేకలు, గేదలు, ఆవులను మేపుకొని ఇప్పటికీ ఈ కొండలపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ సందర్భముగా మాజీ ఎంపీటీసీ రావి దేముళ్లు మాట్లాడుతూ ఇక్కడ ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వానికి తెలియజేయకుండా మండల అధికారులు ఇక్కడ పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ నుండి పెద్ద మొత్తాలలో లంచాలు తీసుకొని, ఈ గ్రామంలో ఎన్ఏఓబీకి అవసరమైన భూమి తీసుకొనే ముందు ఇక్కడ గ్రామ సభ, పబ్లిక్ హియరింగ్ ఇక్కడ ప్రజలకు ముమ్మందు వచ్చే ఇబ్బందులు గుర్తించకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం దీనిపై పూర్తి విచారణ జరిపించి అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇక్కడ బాధితులకు న్యాయం చెయ్యాలని కొత్తగా ఏర్పడుతున్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమలో గ్రామ పెద్దలు గుర్రం నూకినాయుడు, యలమంచిలి శ్రీను, సుమారు 200 వందల మంది మహిళా రైతు కూలీలు పాల్గొన్నారు.

మూడోసారి ఎమ్మెల్యేగా కె.ఎస్.ఎన్.రాజు

విశాలాంధ్ర – చోడవరం: చోడవరం నియోజకవర్గం ఉమ్మడి కూటమి ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు 42,189 ఓట్లు భారీ మెజారిటీతో గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో వరుస విజయం సాధించిన కె.ఎస్.ఎన్. 2019 ఎన్నికల్లో అపజయం పాలైనప్పటికీ, తిరిగి 2024 సార్వత్రిక ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని మెజారిటీతో మూడోసారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొంది విజయకేతనం ఎగురవేశారు. ఈ మేరకు చోడవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ధ్రువీకరణ పత్రాన్ని అంద జేశారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన కె.ఎస్.ఎన్.రాజుకు నియోజక వర్గ ప్రజలు, టి.డి.పి. నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేసారు.

టైకూన్ రోడ్డు డివైడర్ తొలగింపు
వాహనదారులకు లభించిన ఉపశమనం

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: వైసీపీ ప్రజా ప్రతినిధుల అరాచకాలపై ఆట మొదలైంది. ఐదేళ్లపాటు విశాఖలో వారు చెప్పిందే వేదంగా అధికారులు చేసేవారు. ప్రజల అవసరాలు ప్రజా ఆందోళన ఉద్యమాలను పెడచెవిన పెట్టి వారి స్వప్రయోజనాల కోసమే విశాఖలో చివరకు రహదారులను సైతం మూసేశారు. సిరిపురం టైకూన్ జంక్షన్ వద్ద మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మాణాలకు అనుకూలంగా వాస్తు దోషం పేరుతో గత ఏడాది క్రితం రోడ్డును మూసేసిన అధికారులు తీరుపై పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమైనా అధికారులు పట్టించుకోకపోవడంతో తాజాగా కూటమి ప్రభంజనం సృష్టించడంతో అక్రమాలు, అన్యాయాలను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎంవీవీకి లబ్ధి చేకూరేలా మూడు రోడ్ల జంక్షన్‌ను మూసివేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతూ వచ్చారు. ఎవరికి ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. కూటమి సునామీలో వైసీపీ కొట్టుకు పోవడంతో ప్రజలు ధైర్యం తెచ్చుకొని టైకూన్ జంక్షన్ వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన స్టాపర్లను తొలగించారు. ప్రజలకు సపోర్ట్‌గా టీడీపీ నగర అధ్యక్షుడు గండి బాబ్జి, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో స్టాపర్లను తొలగించారు. మిగిలిన వాటిని అధికారుల సహాయంతో తొలగిస్తామని తెలిపారు. వారే స్వయంగా వీటిని తొలగిం చడానికి ప్రయత్నించారు. ఈలోపు అక్కడకు పోలీసులు చేరుకున్నారు. జెసిబి సాయంతో పోలీసులే మొత్తం రోడ్డును యధాస్థితికి తీసుకువచ్చి సిగ్నల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

శ్రీ నూకాంబిక దేవస్థానం ట్రస్ట్ బోర్డు రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: 2024 ఎన్నికలలో రాష్ట్రం లోనూ, అనకాపల్లిలోనూ వైసీపీ ఓటమి చెంది, ప్రభుత్వ కాల పరిమితి ముగిసిన సందర్భంగా నైతిక బాధ్యత వహిస్తూ తాము తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మి శ్రీని వాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ, సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మల్లవరపు ఈశ్వర్రావులు తెలియజేసారు. ఈఓ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్‌కి తమ రాజీనామా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కొణతాల మురళీ కృష్ణ, ధర్మకర్తలు మాట్లాడుతూ 2023 ఆగష్టు 30న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహనరెడ్డి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆశీస్సులతో అమ్మవారి దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేసామని, చరిత్రలో నిలిచిపోయే అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో పాలుపంచుకొనే అదృష్టం తమకు దక్కిందని, ఎన్నికల కోడ్ పరంగా అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో పాల్గొనలేక పోయా మనే వెలితి ఉన్నప్పటికీ తమ హయాంలో దసరా ఉత్సవాలు, ధర్మోత్సవాలు, సంక్రాంతి సంబరాలు లాంటి అనేక కార్యక్రమాలను నిర్వహించే అవకాశం అమ్మవారు కల్పించారని అన్నారు.

తమ కాలపరిమితిలో తమ విధినిర్వహణలో సహకారం అందించిన ఈఓ, సహాయ కమిషనర్ బండారు ప్రసాద్‌కి, అర్చకులకు, ఆలయ సిబ్బందికి, శ్రీ నూకాంబిక అమ్మవారి భక్త బృందాలైన అదిబాబు, అమావాస్య యూత్, మాలాధారణ సంఘం, భజన మండలి వారికి, దాతలకు తమ ధర్మకర్తల మండలి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

బుచ్చయ్యపేటలో కూటమి సంబరాలు

విశాలాంధ్ర – బుచ్చయ్యపేట: చోడవరం కూటమి అసెంబ్లీ అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు 9090 ఓట్లు మెజార్టీని సాధించడంతో బుచ్చయ్య పేట మండలంలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అత్యధికంగా వడ్డాది పంచాయతీలో టిడిపికి 1208 ఓట్లు మెజారిటీ వచ్చింది. ప్రతి గ్రామంలోనూ కూటమికి భారీ మెజారిటీ రావడంతో మండలంలో టిడిపి నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

ఎమ్మెల్యే అనితకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర – పాయకరావుపేట: ఎమ్మెల్యేగా అఖండ మెజా రిటీతో గెలుపొందిన వంగలపూడి అనితకు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు. పూల దండలు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, నారపురెడ్డి పద్మావతి, దేవవరపు ఆనంద్ కుమార్, గొల్లపల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

విశాలాంధ్ర – నక్కపల్లి: మండలంలో దోసలపాడు అగ్రహారానికి చెందిన మహిళకు పురిటి నొప్పులు ఎక్కవ రావటంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా తక్షణమే 108 సిబ్బంది చేరుకొని తుని ఏరియా హాస్పిటల్‌కి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవం జరిగింది. గర్భిణీ ఆడ బిడ్డకు జన్మినిచ్చినట్లు 108 సిబ్బంది చంద్రమౌళి, పైలట్ రాము తెలిపారు.

సుందరపు గెలుపొందడంతో సంబరాలు

విశాలాంధ్ర – యలమంచిలి: సుందరపు విజయకుమార్ గెలుపొందడంతో యలమంచిలి జనసేన పార్టీ నాయకులు పల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దపల్లి వార్డులో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు అని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడి ఎప్పుడు ఎలక్షన్ వస్తుందా ఎప్పుడు ఓటేద్దామా అని ఎదురు చూస్తూ ఈ ఎలక్షన్ ద్వారా తమ తీర్పును ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ, టీడీపీ, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భావవ్యక్తీకరణకు చిత్రలేఖనం దోహదం

జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: భావవ్యక్తీకరణకు చిత్ర లేఖనం దోహదపడుతుందని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు పేర్కొన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రీ గౌరీ గ్రంథాలయంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా కిడ్స్ జూనియర్, సీనియర్ విభాగాల్లో బుధవారం జరిగిన చిత్ర లేఖన పోటీల విజేతలకు ఆయన బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుందని దానిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తే పిల్లలు ఆ రంగంలో అగ్రస్థాయికి చేరతారని అన్నారు. ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను చిన్నారులు బొమ్మల ద్వారా చూపించడం అభినందనీయ మన్నారు. ఏదైనా విషయం చెబితే అందుకు అనుగుణంగా సృజనాత్మక శక్తితో అద్భు తంగా చిత్రాలు గీయడమే చిత్రలేఖనమన్నారు. రంగుల స్వభా వాన్ని బట్టి సందేశాత్మక పెయింటింగులు వేయడాన్ని అలవరచు కోవాల న్నారు. సామాజిక పరిస్థితులను ఆలోచించగలిగేలా ఆధునిక చిత్రకళలో విద్యార్థులు రాణించాలన్నారు. కంప్యూటర్ సహాయంతో కూడా విభిన్నమైన పెయింటింగ్ వేయడానికి ప్రయత్నం చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు అన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణ తాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు. భవిష్యత్‌లో జిల్లాలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్య క్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీ గౌరీ గ్రంథా లయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, గ్రీన్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు, విశ్రాంత జిల్లా అటవీశాఖాధికారి జానకీరావు, విశ్రాంత అటవీ శాఖ రేంజర్ బి.వినోద్‌కుమార్, ఆర్.అనిత, నీలవేణి, నగిశెట్టి సత్తిబాబు, బేతాళం శేషసాయి, కె.రాజేష్, కె.గణేష్ పాల్గొన్నారు. అనంతరం శ్రీ గౌరీ గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

కూటమిని గెలిపించిన ప్రజలకు వందనాలు

జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ

విశాలాంధ్ర – కశింకోట: జీవీఎంసీ 80వ వార్డులో ఉన్న పాత 23వ వార్డు చినరామస్వామి కోవెల వద్ద జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ బలపర్చిన కూటమి అభ్యర్థులు విజయ దుందుభి మ్రోగించిన సందర్భంగా చినరామస్వామి కోవెలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీలిచ్చిన మహిళలను అభినందించారు.

టీడీపీ 80వ వార్డు ఇన్‌చార్జ్ బొడ్డేడ జోగినాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వీట్లు పంపిణీ చేయడం జరిగిందని మురళి అన్నారు. జోగినాయుడు మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పు అమోఘమైనదని, అనకాపల్లిలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు 65,764 మెజార్టీ పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్‌కు 2,96,530 మెజార్టీ ఇచ్చిన ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ మీ రుణం తీర్చుకో లేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పొలిమేర మణి, కర్రి శివ, కర్రి కృష్ణారావు, పెంటకోట చంద్రరావు, కర్రీ హేమంత్, కాండ్రేగుల బుజ్జి, పెంటకోట గణేష్, కర్రి సీతయ్య నాయుడు, కర్రీ సేమియా, రాము, రాపేటి రాము, దాడి కోటేశ్వరరావు, విల్లూరి సత్తిబాబు, మళ్ళ వెంకటేష్, విల్లూరి నర్సింగరావు, అందే హేమంత్, దాడి నూకేశ్వరరావు పాల్గొన్నారు.